రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# యువతతోనే సమాజంలో మార్పు

- యువత రాజకీయాల్లోకి రావాలి
- మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి
- తాండూరులో యువ ప్రభంజనం సభ సక్సెస్



యువతకు అభివాదం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే.

**తాండూరు, నవంబరు 4, ప్రభాతవార్త :**
యువతతోనే సమాజంలో మార్పు చేకూరుతుందని, యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఫైలట్ రోహిత్‌రెడ్డిలు అన్నారు. శనివారం తాండూరులోని విలియమూన్ మైదానంలో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆద్వర్యంలో బీఆర్‌ఎస్ యువ ప్రభంజనం సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా మంత్రి మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వేలాదిగా యువకులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. యువతతోనే సమాజంలో మార్పు చేకూరుతుందని అన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. యువత పోరాటంతోనే తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాబోతుందని అన్నారు. యువత అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిని మరో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే ఫైలట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాండూరులో బీఆర్‌ఎస్ పార్టీకి యువతే బలం.. బలగం.. అని అన్నారు. తాండూరు ప్రాంత అభివృద్దిలో కూడ యువత తోడ్పాటు అందించారని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా తాండూరును అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. రూ.1680కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. తాండూరులో ఓటు అడిగే హక్కు బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. తాండూరు ప్రాంత ప్రజలు, యువత మరో సారీ అవకాశం కల్పించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ కృష్ణయ్య కుమారుడు అరుణ్‌కుమార్‌తో పాటు యువనాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో రెండవ రోజు 12నామినేషన్లు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 4, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రెండవ రోజు శనివారం వరకు 12నామినేషన్లు అందినట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. రాష్ట్ర శాసనభ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు శుక్ర,శనివారంలలో రెండవ రోజు వరకు 12నామినేషన్లు దాఖలు అయినట్లు వివరించారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు, మల్కాజ్‌గిరి నుంచి మూడు, కూకట్‌పల్లి నుంచి రెండు, ఉప్పల్ నుంచి ఐదు నామినేషన్లు సంబంధిత ఆర్‌ఓలకు నామినేషన్లు అందినట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. అదే విధంగ కుత్బుల్లాపూర్ నుంచి రెండవ రోజు వరకు ఒక్క నామినేషన్ కూడ అందలేదని అన్నారు. అయితే మొదటి రోజు ఆరు, రెండవ రోజున ఆరు నామినేషన్లు అందినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల పాటు నామినేషన్లు ప్రశాంతంగ జరిగినట్లు ముందస్తుగ ఐదు చోట్ల ఉన్న ఆర్‌ఓ కార్యాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయటం జరిగిందని కలెక్టర్ వివరించారు.

# సిఎం కెసిఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి : మంత్రి సబితారెడ్డి

- అభివృద్ధి సంక్షేమాలే మా నినాదాలు.. విధానాలు
- ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించండి



ప్రచారంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి,బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పి.సబితాఇంద్రారెడ్డి.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదారాబాద్, నవంబర్ 4(ప్రభాతవార్త):**
రాష్ట్ర అభివృద్ది సీఎం కేసిఆర్‌తోనే సాధ్యమని విద్యాశాఖ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్ధి సబితారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండల పరిధిలోని హర్షగూడ తండాలో గడపగడప ప్రచార కార్యక్రమంలో మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.సబితాఇంద్రారెడ్డి పాల్గొని ఓటర్ల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపి ప్రభుత్వం ఎన్నికలు రాగానే పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు పెంచకుండా,ఫలితాలు రాగానే పెంచుతున్నారన్నారు. ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వెంటనే 400కే గ్యాస్ అందిస్తారని అన్నారు. 2వేలు ఉన్న ఆసరా పెన్షన్లు రూ.5వేలు, 4వేలు ఉన్న వికలాంగుల పెన్షన్ రూ.6వేల వరకు పెంచబోతున్నట్లు తెలిపారు. మహిళలకు ప్రతినెల సౌభాగ్య లక్ష్మీ పథకం ద్వారా రూ.3వేలు అందిస్తామని,రైతుబీమా లాగా 93లక్షల తెల్ల రేషన్ కార్డు దారులకు బీమా సౌకర్యం కలిగిస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో రైతుబంధు ద్వారా ఇప్పటికి వరకు 389కోట్లు, రైతు బీమా ద్వారా 24కోట్లు,రుణమాఫి క్రింద రూ.87కోట్లు, ఆసరా ఫించన్లు 576కోట్లు, కళ్యాణలక్ష్మీ కింద 106కోట్లు,షాదిముబారక్ పథకంలో 51కోట్లు సహాయా నిధితో 15కోట్లు సహయం చేసినట్లు మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో 16కోట్లతో సమీకృతా మార్కెట్ సముదాయాలు నిర్మిస్తున్నట్లు, 8కోట్లతో మోడ్రన్‌దోబి ఘాట్‌లు, గొర్రెల పంపిణీకి 42కోట్లు, చేపల పంపిణీకి 5కోట్లు,ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం పొందిన 2029 మంది మహిళలకు కేసిఆర్ కిట్లు, నియోజకవర్గంలో 84 కుల సంఘాలకు స్థలాలు కేటాయించి ఆత్మగౌరవ భవనాలను నిథులు కేటాయించినట్లు వివరించారు. నియోజకవర్గంలోని బడంగ్ పేట్, మీర్‌పేట్, తుక్కుగూడ, జల్‌పల్లి జంట కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో 832కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 280 కోట్ల భారీ నిధులతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని పేర్కొన్నారు. 40కోట్లతో అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేసినట్లు ఆమె అన్నారు. రైతు భీమా లాగా 93లక్షల కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. మహిళలకు 3వేలు అందించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసిఆర్ రైతులకు ఎకరాకు 10 వేలు, 24 గంటల విద్యుత్,కళ్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలు,ఆసరా పెన్షన్లు ఇస్తుంటే రైతు బంధు ఆపమని కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారని, రైతులకు వ్యతిరేకంగా వ్యవహారిస్తున్నారని వివరించారు. రైతులకు 3 గంటల విద్యుత్ చాలని మరొక నేత పేర్కొన్నారన్నారు. కేంద్రం బిజెపి ప్రభుత్వం తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేసిఆర్ వస్తేనే మన ప్రాంతంలో మెట్రో పరుగులు పెడుతుందని,మెడికల్ కళాశాల వస్తుందని,మరో హైటెక్ సిటిగా మన ప్రాంతం మారబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

# పెద్ద ఉమ్మెంతాల్‌లో వైభవంగా శ్రీ తిరుమలనాథ స్వామివారి రథోత్సవం



పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో తిరుమలనాథ స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తదితరులు



తిరుమలనాథ స్వామివారి ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

**పూడూరు, నవంబర్ 4, ప్రభాతవార్త ;**
పూడూరు మండలం పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో జరుగుతున్న శ్రీ తిరుమలనాథస్వామి ఉత్సవ (జాతర) కార్యక్రమాల్లో భాగంగా మూడవరోజు శనివారం తిరుమలనాథ రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ పీఠాధిపతులు వెంకటదాసులవారి అద్వర్యంలో జరిగిన శ్రీ స్వామివారి రథాన్ని లాగేందుకు వివిధ గ్రామాలనుండి వచ్చిన భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా తెల్లవారు జామున 5 గంటలకు ఆలయంనుండి ప్రారంభమైన స్వామివారి రథోత్సవం గ్రామంలో వీధివీధిన కలియ తిరుగుతూ మందగడ్డ వరకువెళ్లి 11 గంటల ప్రాంతంలో తిరిగి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్వామివారి రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు అడుగడుగున దండకాలు వేస్తూ,గుమ్మడికాయ,కొబ్బరికాయలు కొడుతూ, భజనలు,కోలాటాలు వేస్తూ స్వాగతం పలికారు. ఆలయంలో పూలవసంతోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శంకర్‌పల్లి నాగభూషణంతోపాటు పలువురు వక్తలు పాల్గొని ప్రవచనాలను వినిపించారు. పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డితో కలిసి ఎంపిపి మల్లేశం,సర్పంచులు శ్రీధర్‌గుప్తా,ఉదాన్‌రావు బుచ్చన్నయాదవ్,బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌గుప్తా,గోవార్ధన్‌రెడ్డి, ముక్కంటి,ఎ వెంకటయ్య,ఎల్ సత్యనారాయణ తదితరులు,మాజీ ఎమ్మెల్యే, డిసిసి అద్యక్షులు రామ్మోహన్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి తదితరులు వేరువేరుగా దర్శించుకొని శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కిషన్ పంతులు అద్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భజన మండలీలు పాల్గొని శ్రీ రాకంచెర్ల వెంకటదాసులవారి సంకీర్తనలు ఆలాపించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో పెద్దఉమ్మెంతాల్ గ్రామంఅంతా తిరుమలనాథ స్వామివారి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆదివారం స్వామివారి ఏకాంతసేవా, మానసపూజా కార్యక్రమాలతో ముగుస్తుందని నిర్వాహకులు తెలియజేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన మనోహార్‌రెడ్డి



నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న మనోహార్‌రెడ్డి

**తాండూరు, నవంబరు 4, ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి శనివారం తన మొదటి విడత నామినేషన్ దాఖలు చేశారు. తాండూరు అర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం మనోహార్‌రెడ్డి తన నామినేషన్ ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాస్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. మనోహార్‌రెడ్డి వెంట కుటుంబసభ్యులతో పాటు టీపీసీసీ ఉపాధ్యక్షులు ఎం.రమేష్ మహారాజ్, ప్రధాన కార్యదర్శి, జెడ్పిటీసీ ధారాసింగ్, అధికార ప్రతినిధి కల్వ సుజాత ఉన్నారు.

## ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చు : కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 4, ప్రభాతవార్త**
ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదులు చేయవచ్చని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ వివరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ ఎన్నికల వ్యయసంబంధిత అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా ఎన్నికల వ్యయపరిశీలకులకు ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. శనివారం మేడ్చల్ జిల్లాకు విచ్చేసిన ఎన్నికల పరిశీలకుల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగ ప్రేమ్ ప్రకాశ్ మీనా ఫోన్ నెంబరు (7337047773కు, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లికి వ్యయ పరిశీలకులుగ బాలాసాహెబ్ బాపూరావు లు ఎన్నికల వ్యయపరిశీలకులుగ ఉన్నారని, ఎన్నికల వ్యయ అంశాలపై ఫోన్ నెంబరు 7337047774కు ఫిర్యాదులు ఎవరైనా చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

# రాజుకున్న ఎన్నికల వేడి

- పరిగిలో నువ్వా నేనా అంటున్న బీఆర్ఎస్,కాంగ్రెస్ పార్టీలు

**పరిగి నవంబరు4,ప్రభాతవార్త :**
పరిగి నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంది ప్రధాన రాజకీయ పార్టీలైన బిఆర్‌ఎస్ కాంగ్రెస్ పార్టీలు గ్రామాల వారీగా పర్యటించడం మొదలు పెట్టాయి. ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఉండగా కాంగ్రెస్ పార్టీ నుండి మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పోటీ చేయనున్నా రు. వీరితో పాటు ప్రధాన రాజకీయ పార్టీలైనా బిజెపి నుండి మారుతి కిరణ్ భూనేటి,బిఎస్పీ నుండి ఎన్కేపల్లి ఆనంద్‌లతో పాటు మరికొందరు స్వతంత్ర అభ్యర్థులుగా ఎమ్మెల్యే పోటీ రంగంలో ఉన్నప్పటికి ప్రధాన పోటీ మాత్రం బిఆర్‌ఎస్,కాంగ్రెస్ పార్టీల మధ్యనే నెలకొని ఉంటుంది. ప్రస్తుతం రాజకీయ పరిస్థితిని పరిశీలిస్తే ప్రజలు మాత్రం అత్యధికంగా బిఆర్‌ఎస్,కాంగ్రెస్ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. బస్సు యాత్రలో భాగంగా కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికే.శివకుమార్,పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పరిగికి రావడంతో పరిగి మాజీ జడ్పిటిసి చంద్రయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రధాన పార్టీలైన బిఆర్‌ఎస్, కాంగ్రెస్,బిజెపి ,బిఎస్పీ నాయకులు మండలాల వారీగా నాయకులను దగ్గర తీసుకొని బుజ్జగింపులా చర్యలు చేపడుతున్నారు.




## ఎన్నికలు సజావుగా జరిగేందుకు సమన్వయంతో పనిచేయాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు శంకర్‌గుప్త



కందుకూరు డివిజన్ కేంద్రంలో ఎన్నికల పర్యవేక్షన బృందాలతో సమావేశమైన ఎన్నికల వ్యయ పరిశీలకులు

**కందుకూరు, నవంబర్ 4, ప్రభాతవార్త:**
ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు శంకర్‌గుప్త అధికారులు సూచించారు. శనివారం కందుకూరు డివిజన్ కేంద్రంలోని సమావేశ మందిరంలో ఎన్నికల పర్యవేక్షన బృందాలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఎంసిసి, ఎఫ్ఎస్‌టి, విఎస్‌టి, వివిటి బృందాలతో మాట్లాడారు. ఎన్నికల నియమావలి సక్రమంగా అమలు జరిగేలా ఈ బృందాలు పని చేయాలన్నారు. అసెంబ్లీకి పోటీ అభ్యర్థి వ్యయం ఎన్నికల నిబందనల ప్రకారం రూ 40 లక్షలవరకు ఉంటుందన్నారు. వీరు నిర్వహించే సమావేశాలు, ర్యాలీలు, ప్రచార ఖర్చులు ఏరోజుకారోజు తీసుకోవాలని అధికారులు అభ్యర్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల నిర్వహనలో పని చేస్తున్న టీంలన్ని సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## కుల్కచర్లలో రూ.3లక్షల 60వేలు పట్టివేత : ఎస్ఐ శ్రీశైలం

**కుల్కచర్ల నవంబర్ 03,ప్రభాతవార్త :**
అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తి నుండి 3లక్షల 60వేల రూపాయలు స్వాదీనం చేసుకున్నామని కుల్కచర్ల ఎస్ఐ శ్రీశైలం తెలిపారు. శనివారం రుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రదాన చౌరస్తాలో ఎస్ఐ శ్రీశైలం సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కుల్కచర్ల గ్రామానికి చెందిన సాలె అంజిలయ్య(70)ఒక కవర్‌తో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు సోదా చేశారు. అతని వద్ద 3లక్షల 60వేల రూపాయలు లభించాయి. డబుకబ విషయమై అతనిని విచారించగా సరైైన కారణాలు తెలుపకపోవడంతో డబ్బును స్వాదీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. ఈ సందర్బంగా ఎస్ఐ శ్రీశైలం మాట్లాడుతూ ఎన్నికల నిబందనలు అమలులో ఉన్న కారణంగా ఎక్కువ డబ్బులు తీసుకువెళ్లేవారు ఖచ్చితంగా సరియైన ఆదారాలు తెలుపాలని లేనిచో సొమ్మును స్వాదీనం చేసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువును పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వాదీనం చేసుకున్న సొమ్ముతో కుల్కచర్ల పోలీసులు

# కాంగ్రెస్ విజయానికి సమిష్టిగా కృషి చేయాలి : రేవంత్‌రెడ్డి



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

**కొడంగల్,నవంబర్ 4ప్రభాతవార్త**
కొడంగల్‌లో కాంగ్రెస్ పార్టీ విజయానికి సమిష్టిగా కృషి చేయాలని టీపీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు వెంకటయ్యగౌడ్,గోపాల్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్,టీపీసీసీ సభ్యులు ఎండీ.యుసూఫ్,నందారం ప్రశాంత్‌ల అద్వర్యంలో హైద్రాబాద్‌లోని జూబ్లీహీల్స్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో వారంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రేవంత్‌రెడ్డి కండువాలతో పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలోనే ఈ సారి ఎన్నికల్లో కొడంగల్ కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో న్యాయవాది వెంకటేష్,రవికుమార్,నాగప్పయాదవ్,రాములు,మహిపాల్,శివప్పలతో పాటు సుమారు 100 మంది ఉన్నారు. అలాగే కొడంగల్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన సోదరుదు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సమక్షంలో కొడంగల్ మండలంలోని అంగడిరైచూర్,దౌల్తాబాద్ మండలంలోని చంద్రకల్,దేశాయిపల్లి,బాలంపేటలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో పాటు కోస్గీ మాజీ వార్డు సభ్యులు చంద్రయ్య,వీహెచ్‌పీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# శిక్షణ తరగతులకు హాజరుకాని అధికారులు,సిబ్బందిపై కఠిన చర్యలు

- ఎన్నికల నిబంధనలు తప్పకుండ పాటించాలి
- జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



మేడ్చల్ జిల్లాలో శిక్షణ తరగతుల కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబరు 4, ప్రభాతవార్త**
ఎన్నికల సందర్భంగ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు హాజరు కాని అధికారులపై, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని, ఎన్నికల నిబంధనలు తప్పకుండ పాటించాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలోని రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన పిఓల,ఎపిఓలకు పోలింగ్ విధులు,బాధ్యతలపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నందున కలెక్టర్ సందర్శించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ గౌతమ్ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన శిక్షణా తరగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది ఖచ్చితంగ శిక్షణకు హాజరు కావాలని నిర్లక్ష్యం చేస్తే హాజరు కాకుంటే ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ విషయంలో అధికారులు,సిబ్బంది ఎలాంటి పొరపాట్లు చేయకుండ ఎన్నికల నిబంధనలను తప్పకుండ పాటించాలని, శిక్షణ తరగతులకు హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు.

## ఒక్కసారి ఆశీర్వాదించండి... అభివృద్ధి చేసి చూపిస్తా : వీర్లపల్లి శంకర్



చింతకుంట గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వీర్లపల్లి శంకర్.

**షాద్‌నగర్, నవంబర్ 4, (ప్రభాతవార్త) :**
గత రెండు పర్యాలు బీఆర్‌ఎస్ పార్టీని నమ్మి ప్రజలు ఆగమైపోయారని, ఈ సారి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వాదించి చూడండి అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ప్రజలను కోరారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కాశిరెడ్డిగూడ, చింతగూడ, నేరేళ్ల చెరువు, బూర్గుల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ... ఎందరో కళాకారులు, నిరుద్యోగులు, కవులు, ప్రజా సంఘాలు ఎన్నో పోరాటాలు చేస్తే చలించిన సోనియమ్మా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నేరవేస్తు తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని ఆయన తనదైన శైలిలో ధ్వజమెత్తారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే ఏ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రజలందరికీ అందే విధంగా చూశారు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పథకాలు ప్రవేశపెడితే కొంత మందికి మాత్రమే అవి అందుతాయని, మిగతా వారికి అందవని ఆయన విమర్శించారు. బీసీ బందు, దళిత బంధు, డబుల్‌బెడ్‌రూంలు తదితర పథకాలు ప్రజలకు సరిగ్గా అందించలేకపోయారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు రూ.500వందలకే గ్యాస్ సిలిండర్ అందజేస్తుందని, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తుందని, 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.2500 ప్రతి నెల అందిస్తుందని ఆయన వివరించారు. అదేవిధంగా ఆడపిల్లల పెళ్లిలకు రూ.లక్ష రూపాయలతో పాటు ఒక తులం బంగారం ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. గృహాజ్యోతి పథకం కింద పేద ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విదునయత్ అందిస్తామని ఆయన ప్రజలకు వివరించారు. ఒక్కసారి ఆశ్వీరదించండి తల్లి... మీ సేవకుడిగా నిత్యం పనిచేస్తానని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రతి గడపకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. ప్రచారంలో ఫరూఖ్‌నగర్ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సీనియర్ నాయకుడు బ్లాక్‌కాంగ్రెస్ అద్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మునావర్, తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

